
ప్రజాశక్తి
బుధవారం 28 మే 2025
5
అల్లూరి సీతారామరాజు



విరగ్గాసిన లిచ్చి ఫలాలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలోని చింతపల్లి ఉద్యానవన కేంద్రంలో లిచ్చి చెట్టు విరగ్గాశాయి. ఈసారి చెట్టు ఫలాలు సమృద్ధిగా కాయడంతో చింతపల్లి ఉద్యానవన కేంద్రం సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెట్టు పొడవు ఎక్కువగా ఉండటంతో కొంతమంది సిబ్బంది ఎక్కి పండ్లు కోస్తున్నారు. లిచ్చి ఫలాల వర్షాకాల ఋతువు ప్రారంభ సమయంలో ఇలా విరివిగా ఫలించడాన్ని చింతపల్లి గ్రామస్తులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త శెట్టి బిందు మాట్లాడుతూ, లిచ్చి పండ్లు శరీరానికి శక్తిని అందించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ముఖ్యపాత్ర వహిస్తాయన్నారు. ఈ చెట్టు దిగుబడితో అర్థికంగా మంచి ఆదాయం వచ్చే అవకాశముందని తెలిపారు.



లిచ్చి చెట్టు

ఉగ్రదాడిపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలి

- సమైక్య యాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం

ప్రజాశక్తి-పాడేరు: పహల్గాంలో పర్యాటకులను బలిగొన్న టెర్రరిస్టుల ఉగ్రదాడిని ఖండించడంలో దేశ ప్రజానీకం ప్రదర్శించిన ఐక్యత, సమైక్యత, స్ఫూర్తి ప్రజలందరినీ ఒక్క తాటిపై నిలిపిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం తెలిపారు. ఉగ్రదాడిపై ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై దేశ ప్రజలకు వివరించడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమైక్య యాత్రలో భాగంగా పాడేరు జిల్లా కేంద్రంలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో సమైక్య యాత్ర ర్యాలీ నిర్వహించారు. పాడేరు మెయిన్ రోడ్ బజారు నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ఈ సమైక్య యాత్ర కొనసాగింది.అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాలిక లక్కు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం మాట్లాడుతూ, ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజన తీసుకొచ్చి మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి పథకం పన్నారన్నారు. మతోన్మాద శక్తులు ఉగ్రవాదానికి మతంతో ముడి వేసి ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూసారని విమర్శించారు.వక్రబుద్ధితో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశాన్ని బలహీన పరచాలనుకున్నారని, ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు సంబంధించి ఇరుదేశాల ప్రతినిధుల నుండి అధికారిక ప్రకటన రాకుండానే అమెరికా అధ్యక్షుడు ప్రకటన విడుదల చేయడం ప్రజల్లో ఆందోళన వ్యక్తమయ్యిందన్నారు.తృతీయ పక్షం జోక్యం లేకుండా వివాదాలు ద్వైపక్షికంగా పరిష్కరించుకోవలసి ఉందని అన్నారు. కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కషి చేస్తానని ట్రంప్ చెప్పడం మరింత వివాదస్పదంగా మారిందని పేర్కొన్నారు. సంక్షోభంలో ఉన్న అమెరికా ఆసియా ఖండంలో తన ఆధిపత్యాన్ని కాపాడుకుంటూ మనలాంటి దేశాలపై సుంకాలు విధించి దోపిడీ చేయాలని పథకం పన్నిందని విమర్శించారు.



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, దేశ ప్రతిష్టను ట్రంప్‌కి తాకట్టు పెట్టారన్నారు ఉగ్రవాదం పేరుతో మైనారిటీల పై విషం కక్కుతున్నారని దుయ్యబట్టారు. మతోన్మాద శక్తులు ప్రజల ఐక్యతను చిన్నభిన్నం చేయడానికి కంకణం కట్టుకున్నారని, కొంతమంది రాజకీయ నాయకులు కూడా మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రకటన చేస్తున్నారని విమర్శించారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ లౌకిక పార్టీ అని, దేశ సమైక్యత, మతసామరస్యను రాష్ట్ర హక్కులను కాపాడుకోవడం కోసం ప్రతిపక్షాలతో కలిసి పోరాడిందని, నేడది నిర్వహిస్తున్న పాత్ర దానికి భిన్నంగా ఉందని తెలిపారు. ఎన్. డి. ఏ తో భాగస్వామ్య పార్టీగా బిజెపి మతోన్మాదం కు రాష్ట్ర ప్రభుత్వం వంతపడుతుందన్నారు. . బిజెపితో దోస్తి భవిష్యత్తులో ఉనికికే ప్రమాదమన్నారు. మతపరమైన విభజనకు తావు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిలో సురేంద్ర, దీసరి గంగరాజు, వి.ఉమామహేశ్వరరావు, బిసి పడాల్, ఎస్పీ పోతురాజు, కె. త్రినాథ్, పాలికి లక్కు, ఎల్ సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.



భూముల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పోలవరం నిర్వాసితులకు భూములు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం నేపథ్యంలో భూములు కోల్పోతున్న వీఆర్‌పురం మండలానికి చెందిన నిర్వాసితులకు మంగళవారం రాజవొమ్మంగి మండలంలో ప్రైవేట్ భూములను అధికారులు పరిశీలించారు. మండలంలోని జడ్డంగి, తంటికొండ తదితర గ్రామాల్లో భూములను అధికారులు పరిశీలించారు. అక్కడ రైతులకు రాజవొమ్మంగి మండలంలో ప్రైవేటు భూములను ఇచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఈ భూముల్లో ఏ ఏ పంటలు పండుతాయి, నీటిసరఫరా తదితర వివరాలు ప్రాజెక్టు ప్రత్యేక అధికారులు సేకరించారు. భూముల వివరాలను నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రత్యేక అధికారులు రెవెన్యూ సిబ్బంది నిర్వాసితులు పాల్గొన్నారు.



సోలార్ లైట్లు అందిస్తున్న ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ డాక్టర్ స్వాతి

కొండరెడ్లకు సోలార్‌లైట్లు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చింతూరు : రాజమహేంద్రవరానికి చెందిన ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటి డాక్టర్ కంటే స్వాతి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఏరువాడ గ్రామానికి చెందిన 23 కొండరెడ్డి కుటుంబాల్లోని 124 మందికి సోలార్‌ల్యాంపులు, రైన్ కోట్లు మగవారికి పంచె, రుమాలు, పిల్లలకు గౌన్లు దుస్తులను అంగన్‌వాడి కేంద్రంలోని చిన్న పిల్లలకు ఆట వస్తువులను అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కంటే స్వాతి అందజేశారు. మారుమూల కొండ ప్రాంతమైన ఏరువాడకు కొంతదూరం ట్రాక్టర్‌పై ప్రయాణించి సుమారు ఒక కిలోమీటర్ కాలినడకన కొండ ప్రాంతానికి చేరుకున్నారు. రోడ్డు సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న కొండరెడ్ల కుటుంబాలకు స్వాతి స్వేచ్ఛ సొసైటీ తరపున సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీం సభ్యులు భావనకృష్ణ సహాయకులు సురేష్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిలో ఆదివాసీ పోస్టులు మినహాయించాలి

-కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



చింతూరు దీక్ష చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి - రంపచోడవరం : 2025 మెగా డిఎస్‌సి నుంచి ఆదివాసి పోస్టులు మినహాయించి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసి జేఏసీ కోర్ కమిటీ సభ్యులు కంగాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. 13వ రోజు రిలే నిరాహార దీక్షల కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు బుడమల మంగిరెడ్డి మాట్లాడుతూ తక్షణమే (టిఏసి) ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి కమిటితో తక్షణమే తీర్మానం చేసి షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జిఒ నంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. ఎస్టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, రాష్ట్రంలో అన్ని ఐటిడిఎల ద్వారా ట్రైకార్ రుణాలు నిరుద్యోగ యువతకు తక్షణమే మంజూరు చేసి ఉపాధి కల్పించాలని మొదలైన సమస్యల పరిష్కారానికి ఆదివాసి జెఎసి తలపెట్టిన రిలే నిరాహార దీక్షలకు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు.

ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు కారుకోడి గాంధీ మాట్లాడుతూ (టిఏసి) ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ కమిటీ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్‌ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగ పట్టభద్రుల భవిష్యత్తును కాపాడాలని టిఎసి కమిటి సభ్యులు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పల్లాల బాలురెడ్డి, కోసు రామన్నదొర, కోసు ప్రసాద్‌దొర, చోడి వెంకటేశ్వర్లుదొర, మడకం లచ్చన్నదొర, కత్తుల రత్న కుమారి, తుర్రం వెంకటేశ్వర్లుదొర, మడకం వీర వెంకటవరప్రసాద్ దొర, చవలం శభకృష్ణదొర, ఆదివాసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్, కారం రామన్న దొర, పొడియం శ్రీనుబాబుదొర, పండా పవన్‌కుమార్‌దొర, పొడియం పండు దొర తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైటప్ : 02 రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన ఆదివాసి జెఎసి కోర్ కమిటి సభ్యులు



రంపచోడవరంలో..

ఉద్యోగ నియమక చట్టాన్ని ప్రకటించాలి

చింతూరు : 2025 మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సి ప్రాంత ఆదివాసి టీచర్ పోస్టులను మినహాయించాలని ఆదివాసి జెఎసి రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్, పీసా ఉపాధ్యక్షులు కారం సాయి డిమాండ్ చేశారు. రంపచోడవరం ఐటిడిఎ వద్ద 13వ రోజు రిలే నిరాహార దీక్షలు కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తక్షణమే (టిఏసి)ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి కమిటితో తక్షణమే తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జిఒ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి జేఏసీ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలకు పెద్దసీతనపల్లి, ఎర్రపేట గ్రామాల యువత, ఉద్యోగులు,నిరుద్యోగులు, సర్పంచ్, గ్రామస్తులు మద్దతు తెలియజేస్తున్నామన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగ పట్టభద్రుల భవిష్యత్తును కాపాడాలని టిఎసి కమిటి సభ్యులు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు కార్యక్రమానికి ఆదివాసి జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లినరేష్ అధ్యక్షత వహించారు. బిజెపి జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య స్వాగత ఉపాన్యాసంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెఎసి డివిజన్ ఉపాధ్యక్ష శీలం తమ్మయ్య, మడకం లక్ష్మణ్, మడివి చందు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న జనసేన మండల అధ్యక్షుడు సాయికృష్ణ తదితరులు

జనసేన సభ్యత్వం కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: మండలంలో జీడిగుప్ప పంచాయతీలోని జీడిగుప్ప గ్రామంలో జనసేన క్రియాశీలక సభ్యత్వం కిట్లు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ ఆధ్వర్యంలో సభ్యత్వం కార్డు, ఇన్సూరెన్స్ ఐడి, పేపర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ జనసైనికులకు, నాయకులకు ఇన్సూరెన్స్ ద్వారా కుటుంబభద్రత ఎలా కల్పించారో అదే విధానంలో రాష్ట్రాన్ని కూడా కాపాడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కనుగుల శ్రీనివాస్‌రెడ్డి, మండల కార్యదర్శి బాగుల అంజనరావు, మండల సహాయ కార్యదర్శి కొత్తూరి శేషు, మండల యూత్ నాయకులు పెదపెట్ల పవన్‌కళ్యాణ్, ముంజపు సాయిరాం, కనుగుల నరేష్, నూప మహేష్, నాయకులు అందెల కృష్ణారెడ్డి, కనుగుల సత్యనారాయణరెడ్డి కల్లమిల్లి నాగరాజు, కనుగుల సుధాకర్‌రెడ్డి, అందెల శ్రీరామ్‌మూర్తి పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం : వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగరాహుల్ ఆదేశాల నేపథ్యంలో రంపచోడవరం ఎక్సైజ్ సిఐ శ్రీధర్, ఎఈఎస్ టిఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రజిత్ సిబ్బంది జడ్డంగిలో నాటుసారా రవాణా చేస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదుచేసి 20 లీటర్ల నాటుసారా, బైక్ స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీధర్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నాటుసారా, బైక్



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కమలతోటలో వైద్య శిబిరం

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని మాదల పంచాయతీ గ్రామంలో కమలతోటలో గన్నెల పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విష జ్వరాతో మంచం పట్టిన కమలతోట పేరుతో ప్రజాశక్తి లో వచ్చిన కథనానికి వైద్య సిబ్బంది స్పందించారు. సోమవారం గ్రామంలో పర్యటించి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో జ్వరాల బారినపడిన బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద జ్వరాలతో బాధపడుతున్న వారిని వైద్య సిబ్బంది బృందం సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు గ్రామంలో పర్యటించి తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు,హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులు యేసురత్నం మృతి

ప్రజాశక్తి-చింతపల్లి: సీనియర్ పాత్రికేయుడు గుండుమళ్ళ యేసురత్నం (58) మంగళవారం మధ్యాహ్నం చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. గత 15 ఏళ్లుగా చింతపల్లిలోని వివిధ దినపత్రికలకు పాత్రికేయుడిగా సేవలం దించిన ఆయన, వృత్తిలో నిబద్ధతతో పాటు ప్రజా సమస్యలపై పట్టుదలతో కలం పట్టి ప్రజల్లో విశేష గుర్తింపు పొందారు. సామాజిక అంశాలపై తన నివేదికల ద్వారా అనేక మార్పులకు నాంది పలికిన యేసురత్నం విభిన్న అంశాలపై ధైర్యంగా రాసిన వార్తలతో స్థానికంగా చర్చనీయాంశంగా నిలిచారు. ఆయన మృతిపై స్థానిక పాత్రికేయ సంఘాలు, సన్నిహితులు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యేసురత్నం మృతి పాత్రికేయ వృత్తికి తీరని లోటని వారు విచారం వ్యక్తం చేశారు.ఆయనకు నలుగురు పిల్లలు ఉన్నారు.



ఏసురత్నం(ఫైల్)

నాతవరంలో భారీ వర్షం

ప్రజాశక్తి-నాతవరం : మండలంలో మంగళవారం సాయంత్రం గంటకు పైబడి ఏకధాటిగా భారీ వర్షం పడింది. దీంతో, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు రోజుల నుంచి వర్షాల కారణంగా వాతావరణం చల్లబడింది. నాతవరం నుంచి తాండవ రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

కొత్తపూదేడును సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

ఎక్సైజ్ సిఐ శ్రీధర్

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని కొత్తపూదేడు గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుదామని ఎక్సైజ్ సిఐ శ్రీధర్ అన్నారు. ఈనెల 26న ప్రజాశక్తి దినపత్రికలో సారాని అరికట్టాలంటూ గిరిజన మహిళలు మొర అనే వార్త ప్రచురితమైంది. లోదొడ్డి పంచాయితీ కొత్తపూదేడులో సారా విచ్చలవిడిగా ఉండటంతో రాత్రి అయితే ప్రతీ ఇంటా గొడవలు అని జడ్డంగి ఎస్ఐ చిన్నబాబుకు మహిళలు మొరపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో రంపచోడవరం ఎక్సైజ్ సిఐ శ్రీధర్ మంగళవారం కొత్తపూదేడు గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించి మహిళల స్ఫూర్తిని అభినందించారు. ఈ గ్రామాన్ని సారారహిత గ్రామంగా తీర్చిదిద్దుదామన్నారు. కొత్తపూదేడు గ్రామ మహిళలను ఆదర్శంగా తీసుకుని ప్రతీ గ్రామంలో చైతన్యం రావాలన్నారు. సారా వల్ల జరిగే అనర్ధాలపై అవగాహన కల్పించారు. అనంతరం జడ్డంగి గ్రామశివారున మోటార్ బైక్‌పై 20 లీటర్లు సారాను తీసుకు వస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సిఐ. శ్రీధర్, హెడ్ కానిస్టేబుల్స్ నాయుడు, మూర్తి, దొరబాబు, శ్రీనివాస్, స్కాడ్ అధికారులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

వైద్యశిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: మండలంలో రేఖపల్లి గ్రామంలో ఆంధ్రా వనవాసి కళ్యాణ్ ఆశ్రమం వారిచే స్థానిక అమ్మవారి ఆలయం వద్ద ఉచిత వైద్యశిబిరం మంగళవారం ప్రారంభించారు. వైద్యశిబిరాన్ని మామిడిరాజు ప్రారంభించారు. ప్రతినెలా 26వ తేదీ నుంచి హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తామని, ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తామని డాక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. గత కొన్నేళ్ల నుండి తమ సంస్థ తరపున పేదలకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. పక్షవాతం, గుండెపోటు, షుగర్, బిపి మందులు కూడా ప్రతినెలా ఉచితంగా అందించడమే కాకుండా ఆపరేషన్లు అవసరమైన వారికి ఆపరేషన్లు చేయడమే కాకుండా మందులు కూడా ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతినెలా మండల వ్యాప్తంగా ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తున్నామని మండల కో ఆర్డినేటర్ ఐ.వి.ప్రసాద్ తెలిపారు. బుధవారం వి.ఆర్.పురం రామాలయం వద్ద ఆరోగ్య శిబిరం కార్యక్రమం నిర్వహిస్తున్నామని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వనవాసి ఆయుర్వేద మండల కార్యకర్తలు బాగుల రాజారావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'వెలుగు'లో అక్రమాలు వెలికితీయాలి

2022లో జీడిపిక్కల ద్వారా వచ్చిన రూ.65 లక్షలు ఏవి?

విడివికె అకౌంట్ నుంచి రూ.7 కోట్లకు వస్తున్న వడ్డీ ఏమవుతున్నట్టు ?

విచారణ రిపోర్టు ఎందుకు దాచిపెడుతున్నారు?

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు

ప్రజాశక్తి - రంపచోడవరం : 2022లో జీడిపిక్కల అమ్మకాల ఆదాయం ద్వారా వచ్చిన 65 లక్షలు ఏమయ్యాయని, విడివికెల అకౌంట్లో నుంచి ఏడు కోట్ల రూపాయలకు 2022 సంవత్సరం నుంచి వడ్డీ ద్వారా వస్తున్న డబ్బులు ఏమవుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. అసలు విడివికెలు నగదు ఖర్చు పెట్టుకోకుండా ఎందుకు దాచిపెడుతున్నారని గతంలో వెలుగులో జరిగిన అవకతవకలపై అలాగే రంపచోడవరం గిరిజన సమాఖ్యలో ఇప్పటివరకూ పెట్టినటువంటి ఖర్చులు అన్నింటిపై విచారణ రిపోర్టుని ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు. గత కొద్ది సంవత్సరాలు నుండి వెలుగులో స్వయం సహాయక గ్రూపులకు ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులు లబ్దిదారులు ఖర్చు పెట్టుకోకుండా కొంతమంది అక్రమాలకు పాల్పడుతున్నారని అటువంటి అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకో కుండా వారిని కాపాడుతు న్నారన్నారు. విజిలెన్స్ ఎంక్వైరీ చేపట్టాలని బాధ్యుల పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రంపచోడవరం ఏడు మండలాల్లో జీడిపిక్కలు కొనుగోలు ద్వారా వచ్చిన ఆదాయాన్ని రైతులకు పంచకుండా అధికారుల గెస్ట్‌హౌస్‌ల మరమ్మత్తుల కోసం ఖర్చు పెడుతున్నా రన్నారు. వెలుగు సిబ్బంది లక్షల రూపాయల అవినీతికి పాల్పడిన వారి మీద ఇప్పటివరకు కూడా ఎటువంటి చర్యలు తీసుకోకుండా కొంతమంది వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పసుపు, చింతపండు, జీడిపిక్కలు కొనుగోళ్లలో కూడా అనేక అవకతవకలు జరిగాయన్నారు. గిరిజనులకు మంజూరైన విడివికె నగదు ఆ సంఘాల ఖాతాల్లో ఉంచి గిరిజనుల జీవనోపాధికి ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఇప్పటివరకు వచ్చిన వడ్డీపై తక్షణమే విచారణ చేపట్టాలని అన్నారు.



లోతా రామారావు



ఉపాధ్యాయుల బదిలీలలో జిఒ 22 అమలు చేయాలి : యుటిఎఫ్



వినతిపత్రాన్ని ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన సంక్షేమ శాఖలోని ఉపాధ్యాయుల బదిలీలకు జీవో. నెంబర్ 22న అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి మహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పీవో అభిషేక్ గౌడకు వినతి పత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు కూడా ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల మాదిరి జీవో 22 ప్రకారం బదిలీ చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు ఒకే చోట ఎనిమిది సంవత్సరాలు కొనసాగించాలని, ఉపాధ్యాయ ఖాళీలను ముందుగా తెలియజేయాలని కోరారు. సీనియారిటీ లిస్టును ఆన్లైన్లో వెలువరించాలని, ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పి దేముడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ రఘునాథ్, సబ్ కమిటీ కన్వీనర్ నాగేశ్వరరావు విన్నవించారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న గణేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతగిరి : గిరిజన ప్రాంతంలో పశు సంవర్ధక శాఖ ఉద్యోగుల బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంచాలకులు కు మంగళవారం లిఖితపూర్వకంగా విన్నంచామని జిల్లా పశు వైద్య అధికారుల సంఘం అధ్యక్షుడు సాగిరి గణేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,కౌన్సిలింగ్ పద్ధతిలో ఉద్యోగి సీనియారిటీ ప్రాతిపదికన ఎటువంటి రాజకీయ ప్రమేయం, పైరవీలు లేకుండా పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని కోరారు. పట్టణ ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులను గిరిజన ప్రాంతాలకు బదిలీలు చేసి ఇక్కడి నుంచి అక్కడికి బదిలీలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి ఉద్యోగికి బదిలీలలో అవకాశం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాలలో అత్యధిక శాతం పోస్టులు ఖాళీగానే ఉన్నాయని, తక్షణమే భర్తీ చేయాలని కోరారు. అనారోగ్యంతో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను వారి ఐచ్చిక మేరకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు

గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని బయలుకించంగి గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీకి చెందిన నడింవాడ (గుండాలగరువు) గ్రామస్తుడు తెరవాడ బాబురావు తన ద్విచక్ర వాహనంపై చింతపల్లి ప్రాంతంలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తున్నాడు. బయలుకించంగి గ్రామంలో ఓ వృద్ధుడు ఆటో దిగి వెళుతుండగా ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో జి మాడుగుల మండలం పాలమామిడి పంచాయతీ వనబంగిపాడు గ్రామానికి చెందిన తాంగుల బొజ్జయ్య (70) తీవ్రంగా గాయపడ్డాడు. శరీరానికి బలమైన గాయాలయ్యాయి.కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి

- యోగాంధ్ర ర్యాలీ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



పాడేరులో ర్యాలీ చేపడుతున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: సంపూర్ణ ఆరోగ్యానికి యోగాసనం దివ్య మార్గమని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగా నిత్యం భాగం కావాలన్నారు. ఐటిడిఏ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు యోగాంధ్రా ర్యాలీని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 4లక్షల 30 వేల మంది యోగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. ఇప్పటి వరకు 60 వేల మంది నమోదు చేసుకున్నారని చెప్పారు. జూన్ 21 న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతీ పల్లెలోను యోగాసన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూన్ 21 వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో అల్లూరి సీతా రామరాజు జిల్లా నుండి 8 లక్షల మంది పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఇంచార్జి పి.ఓ. జె.సి, అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఐటిడిఏ ఎపిఒ ఎం. వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమ లత, డి ఆర్‌డిఏ పిడి వి.మురళి, డిఇఒ పి. బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్.రజని, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ జవహర్ కుమార్, ఎపిసి స్వామినాయుడు పాల్గొన్నారు.

పాడేరు : జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రాంతాలలో కనీసం వెయ్యి మందితో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 29న బొర్రా అనంతగిరి మండలం బొర్రా పాఠశాల మైదానం, జూన్ 04న అరకు ట్రైబల్ మ్యూజియం, జిల్లా ప్రధాన కేంద్రంలో యోగ సాధన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 11న చాపరాయి వాటర్ ఫాల్స్, 17న మారేడుమిల్లి వన విహారి పర్యాటక కేంద్రాలలో యోగ సాధనకు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

పాడేరు, : యోగాంధ్ర లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు జరిగాయని జిల్లా యోగ నోడల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వర రావు తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించిన యోగ ర్యాలీలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఎంజే అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్‌పటేల్ తో పాటు జిల్లా అధికారులు, ఐటిడిఎ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : యోగాంధ్ర పేరుతో తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐటిడిఎ పిఒ అపూర్వభారత్ ఆధ్వర్యంలో ఎర్రంపేట నుండి పోలీస్‌స్టేషన్ అమరవీరుల సెంటర్ లారీ యూనియన్ కార్యాలయం మీదుగా శబరిబ్రిడ్జి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చిరంజీవి, పోలవరం డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డిఎంహెచ్ఒ పుల్లయ్య, మీడియా ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

రంపచోడవరం : ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో ర్యాలి నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పంచాయతీ, మండల స్థాయిలో యోగాపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డివిఎస్ రమణ, తహశీల్దార్ పి.రామకృష్ణ, ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసరావుదొర, డిప్యూటీ తహశీల్దార షేక్ జిలాని, ఎడిఏ సిహెచ్ కెవి చౌదరి, సిడిపిఒ సంధ్యారాణి, ఐటిడిఎ ఎస్ఒ టి.మార్తమ్మ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి బి.కిషోర్, మండల వ్యవసాయశాఖాధికారి కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : యోగాతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం ఉంటుందని ఎంపిపి గోము వెంకటలక్ష్మి అన్నారు. మండలంలో అన్ని పంచాయతీలతో పాటు రాజవొమ్మంగి పంచాయతీ కార్యాలయంలో యోగా తరగతులను ఎంపిడిఒ యాదిగిరేశ్వరావు ప్రారంభించారు. ఎంపిపి వెంకటలక్ష్మి మాట్లాడుతూ యోగాతో మనస్సు ప్రశాంతత పొందడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి కాకర సంధ్యారాణి, కనిగిరి వీరబాబు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయములో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది మంగళవారం యోగాసనాలు వేశారు. ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మారేడుమిల్లి అధ్యక్షురాలు కుమారి సార్ల లలితకుమారి, వైస్ ఎంపిపి లక్కొండ రవికుమార్, సర్పంచ్ కొండా జాకబ్, మెడికల్ ఆఫీసర్ అయుష్ , వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధించాలి

ప్రజాశక్తి-పాడేరు: స్వయం సహాయక సంఘాల మహిళలు చిరువ్యాపారాలు చేసి మహిళా సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. బ్యాంకు లింకేజి ఇచ్చేసి వదిలేస్తే సరిపోదని వ్యాపారాలు చేస్తున్నారా ఆదాయం పెరిగిందా లేదా అని పరిశీలించాలని సూచించారు. మంగళవారం ఐటిడిఏల పి.ఓలు, వెలుగు, ఐసిడిఎస్, గిరిజన సంక్షేమం, డుమా, వైద్య ఆరోగ్య శాఖ, ఎస్ ఎం ఐ, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్యాంకు లింకేజిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీసారు. ఎన్ని గ్రూపులకు బ్యాంకు లింకేజీ ఇచ్చారు? ఎంత తిరిగి చెల్లించారని అడిగి తెలుసు కున్నారు. ఎంపిడిఓలు ఎంపిఎంలతో రెండు వారాలకు ఒక సారి బ్యాంకు లింకేజీలపై సమీక్షించాలని ఆదేశించారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు సక్రమంగా తిరిగి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 15 రోజులకు ఒకసారి ఎపిఎంలు, ఎంపిడి ఓలతో వెలుగు కార్యక్రమాలపై సమీక్షించాలని ఐటిడి ఏపిఓలకు సూచించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి సచివాలయం పరిధిలో అవసరమైన రుణ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. జిల్లాలో 28 వేల మంది చిన్నారులకు ఆధార్ లేదని చెప్పారు. విద్యుత్తు లేని అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్తు సదుపాయాం కల్పించాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మాతా శిశు మరణాలు జరగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మరణాలను సక్రమంగా నమోదు చేయకపోతే వైద్య, ఐసిడిఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఐటిడిఏ పిఒలు ఎం.జె. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, (వర్చువల్) జి ఎస్ డబ్ల్యు నోడల్ అధికారి పి. ఎస్. కుమార్, డి ఆర్డి ఏ పి డి వి.మురళి, ఐసిడి ఎస్ పిడి. ఎన్. సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్. రజని, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి రోహిణి, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డ్వామా పిడి విద్యా సాగర్ పాల్గొన్నారు.

ఎపిఆర్‌జెసిలో 510 సీట్ల భర్తీ

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు ఐటిడిఎ ఫరిధిలో చింతపల్లి, కొయ్యూరు, పెదబయలు, అరకు. జి. మాడుగుల మండలాలలోని ఎపి రెసిడెన్సియల్ బాలుర జూనియర్ కళాశాలలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసిలతో పాటు వొకేషనల్ కోర్సులైన అకౌంట్స్ అండ్ టేక్సేసన్, కంప్యుటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ కోర్సులలో 800 సిట్లకు గాను ఆన్లైన్‌లో 828 ధరఖాస్తులు వచ్చాయని. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని తెలిపారు. మంగళవారం స్థానిక తలారిసింగి ఎపిఆర్ జేసి ప్రాంగణంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ, కౌన్సిలింగ్ లో 510 సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన సీట్ల భర్తీకి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పాడేరు, అరకు, జి. మాడుగుల మండలాలలోని ఎపి రెసిడెన్సియల్ బాలికల జూనియర్ కళాశాలలలో 500 సీట్ల భర్తీకి బుధవారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ కౌన్సిలింగ్ లో డి డి తో పాటు గురుకుల కళాశాలల ఓఎస్డి పిఎస్ఎన్ మూర్తి, కళాశాలల ప్రిన్సిపాల్ కన్వీనర్ వై.పారయ్య, ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గోపాల్

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని వంగసార పెద్దవీధి గ్రామంలో అంగన్వాడి భవన నిర్మాణానికి మంగళవారం ఆ పంచాయతీ సర్పంచ్ సమిటి గోపాల్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ అంగన్వాడి భవన నిర్మాణం పూర్తయితే చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు సురక్షిత వాతావరణాన్ని కల్పించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. లక్ష్మి కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దేవి ప్రియ, కూటమి నాయకులు గెమ్మెలి అబ్బాయి నాయుడు, కేశవ్, వార్డు సభ్యుడు పి.లక్ష్మణ్, కే.నాయుడు, కే. సతీష్, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

12న సామూహిక గృహ ప్రవేశాలు

గృహ నిర్మాణ శాఖ ప్రత్యేకాధికారి రమణ



మాట్లాడుతున్న హౌసింగ్ స్పెషలాఫీసర్ వెంకటరమణ

ప్రజాశక్తి -పాడేరు : జూన్ 12న రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల సామూహిక గృహ ప్రవేశాలు కల్పిస్తామని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి (అకౌంట్స్ అండ్ ఆడిట్ జనరల్ మేనేజర్) పి. వెంకట రమణ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో 11,477 గృహాల నిర్మాణానికి ప్రతిపాదించడం జరిగిందని ఇప్పటి వరకు 4,691 గృహాలు పూర్తయ్యాయని మిగిలిన గృహాలను జూన్ పదవ తేదీలోగా పూర్తి చేసి 12 వ తెదేనాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతకు ముందు వంటలమామిడి పంచాయతిలో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సమావేశంలో గహ నిర్మాణ శాఖ పిడి బి.బాబు, ఇఇ రాజబాబు, ఎ ఇ లు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

అన్నసమారాధన

ప్రజాశక్తి - గంగవరం: గంగవరం మండల కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ఘనంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, గ్రామస్తుల సహకారంతో కార్యక్రమం ఘనంగా నిర్వహించా మన్నారు. సుమారు 1500 మందికి పైగా భక్తులు తరలివచ్చారన్నారు. కార్యక్రమంలో మల్ల రాంబాబు సిద్దు, అరవింద,వెంకటరమణ గోవింద్, చక్రి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా కందుకూరి వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న ఐద్వా, పిఎన్ఎం నేతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మూఢనమ్మకాలు, బాల్య వివాహాలతో పాటు, సమాజంలో ఉన్న అనేక రుగ్మతలపై పోరాడిన సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని ప్రజానాట్యమండలి జిల్లా కార్యాలయం హాష్మీ భవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు తెలుగు రమణ, మహిళా సంఘం నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, సుజాత, సుమిత్ర, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందుతున్న బాల బాలికలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు రమణ మాట్లాడుతూ ఆనాటి రోజుల్లోనే సమాజ మార్పు, విద్య, మహిళల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి వీరేశలింగం అని కొనియాడారు. ఆయన బాటలో నేటితరం బాలలు, పిల్లలు కళాకారులు అందరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాన్స్ శిక్షకులు శ్యామ్, లాస్య, పిఎన్ఎం నాయకులు ఎం.నాగేశ్వరరావు, జయలక్ష్మి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

10న జర్నలిస్టుల ఆడ పిల్లలకు కేన్సర్ నియంత్రణ వ్యాక్సిన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ సహకారంతో జూన్ 10వ తేదీన జర్నలిస్టుల ఆడ పిల్లలకు తుది విడత కేన్సర్ నియంత్రణ ఉచిత వ్యాక్సిన్ వేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోతుమహంతి నారాయణ్, జి.శ్రీనివాస్ తెలిపారు. విశాఖపట్నం ఎవిఎన్ కళాశాల ఎదురుగా ఉన్న చైతన్య స్రవంతి కార్యాలయం ఆవరణలో వ్యాక్సిన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం తొలి విడత వ్యాక్సిన్ వేసుకున్న జర్నలిస్టులకు చెందిన ఆడ పిల్లలు ఈ తుది విడత వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరానికి హాజరుకావాలని కోరారు. కొత్తవారికి ఈ విడత అవకాశం లేదని తెలిపారు.

ఆధార్-బ్యాంక్ అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోయే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలంటే ఆధార్ నెంబర్‌ను బ్యాంక్ ఖాతాతో ఎన్‌పిసిఐ లింక్ చేయడం తప్పనిసరి అని విశాఖపట్నం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ గజేంద్ర కుమార్ మీనా తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలతో ఆధార్ లింకేజ్ కోసం ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు పోస్టాఫీసుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రోడ్డు వెడల్పులో నిబంధనలు కచ్చితంగా పాటించాలి

1/70 షెడ్యూల్ ప్రాంతం గిరిజనులకా, గిరిజనేతరులకా ?

సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి - మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలంలో రోడ్డు వెడల్పులో భాగంగా మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ నెల 25న ఏర్పాటు చేసిన సమావేశంలో భూ ఆక్రమణదారులకి కుర్చీలు వేసి రాచమర్యాదలు చేయటంపై సిపిఎం ప్రాంతీయ కమిటి తీవ్రంగా ఖండించింది. సిపిఎం ప్రాంతీయ కమిటి కన్వీనర్ మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టాన్ని కాపాడే విధంగా అధికారులు ఉండాలన్నారు. గిరిజనులపై లేని ప్రేమ గిరిజనేతరులపై ఎందుకు అని ప్రశ్నించారు. రోడ్డు వెడల్పులో భాగంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రతి షాపు, ప్రతి ఇల్లు ఏదైనా సరే తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరులు వ్యాపారాల పేరుతో 1/70 చట్టానికి విరుద్ధంగా భూ ఆక్రమణలు చేస్తున్నారన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో విధులు నిర్వహించే ఏ శాఖ అధికారి అయినా గిరిజన బిడ్డలను గౌరవించి వారికి న్యాయం చేసే విధంగా ఉండాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రాంతీయ కమిటీ నాయకులు తీగల శ్రీనివాస్, ఈతపల్లి సిరిమల్లి రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రెస్టారెంట్

- పట్టించుకోని అధికారులు
- గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లిరెడ్డి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: రంపచోడవరం కేంద్రంగా ఆర్అండ్‌బి రహదారికి ఆనుకుని నిర్మించిన అర్కా రెస్టారెంట్‌ను తక్షణమే కూల్చేయాలని గిరిజన సంఘ జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అర్కా రిసార్ట్స్ రెస్టారెంట్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందన్నారు.

ఏజెన్సీలో ఎపి టూరిజం పేరుతో గిరిజనులు నడిపించాల్సిన రెస్టారెంట్ రిసార్ట్ బినామీ పేర్లతో నడుస్తోందని స్థానిక గిరిజనులకు ఉపాధి కల్పించకుండా గోకవరం నుంచి ఇతర ప్రాంతాల వారికి ఉపాధి కల్పిస్తూ పేరుకు మాత్రం ఒకరిద్దరిని పెట్టుకుని గిరిజనులతో నడిపిస్తున్నట్లుగా చెప్పుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా పక్కనే దేవాలయం, పాఠశాల ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా బార్‌అండ్ రెస్టారెంట్ నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వభూమిలో ఇష్టానుసారంగా కట్టడాలు నిర్మించడం, ఆ స్థలంలో ఉన్న చెట్లను ధ్వంసం చేయడం వంటి చర్యలు అర్కా నిర్వాహకులు చేపడుతున్నారని అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్టణం వేదికగా జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, ఇతర అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (హెల్త్,మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్) ఎంటి.కృష్ణబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లను ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా చేయాలని ఆదేశించారు. ప్రతి కంపార్ట్‌మెంట్ వద్ద తాగునీరు, మొబైల్ టాయిలెట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రతి రెండు, మూడు కంపార్ట్‌మెంట్లకు ఒకటి చొప్పున వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీర పాండియన్, ఆయూష్ డైరెక్టర్ దినేశ్ కుమార్‌తో కలిసి ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి వరకు కార్యక్రమం జరిగే వివిధ ప్రాంతాలను పరిశీలించారు.

జూన్ 19న ఫుల్ డ్రెస్ రిహార్సల్

జూన్ 19వ తేదీన ఫుల్ డ్రెస్ రిహార్సల్ కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు కృష్ణబాబు సూచించారు. వైద్య, నర్సింగ్ కళాశాల విద్యార్థులను, ఆయా శాఖలు, సంస్థల ఉద్యోగులు, కార్మికులతో పాటు కుటుంబ సభ్యులను కూడా 21న జరిగే ప్రధాన కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. జిల్లాలో చేపట్టిన చర్యల గురించి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిపిటి సాయంతో వివరించారు. కార్యక్రమంలో డిఐజి గోపీనాథ్‌జెట్టీ, డిసిపి అజిత, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీశంకర్, భీమిలీ ఆర్‌డిఒ సంగీత్ మాధుర్ ఇతర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల అమానుష దాడిపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెనాలిలో దళిత, మైనార్టీ యువకులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తూ మంగళవారం ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనార్టీలపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. తెనాలిలో పట్టపగలు నడిరోడ్డుపై అమానుష ఘటనే ఇందుకు ఉదాహరణ అన్నారు. తెనాలిదాడిని రాష్ట్రంలో ప్రజలంతా ఖండించాలని విజ్ఞప్తి చేశారు. 24 గంటలలో చర్యలు తీసుకోపోతే రాష్ట్రంలో ఉన్న దళితులు, మైనార్టీలను ఏకం చేసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎం.సుబ్బారావు, ఎర్రిబాబు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీ ఛార్జింగ్ స్టేషన్, (ఇన్‌సెట్లో) ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు

పోర్టులో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ బిల్డింగ్‌లో బుధవారం ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్లను పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టు చైర్మన్ మాట్లాడుతూ రెండు డిసి ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు, రెండు ఎసి ఛార్జింగ్ స్టేషన్లు (7 నుండి 22 కిలోవాట్ల శక్తితో) ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా ఒకేసారి ఆరు ఎలక్ట్రిక్ వాహనాలను ఛార్జ్ చేయవచ్చని తెలిపారు. పోర్టులో ఈవీ ఛార్జింగ్ సదుపాయాల ఏర్పాటుతో మంత్రిత్వ శాఖ రూపొందించిన హరితసాగర్ మార్గదర్శకాల్లో పేర్కొన్న లక్ష్యాలను పోర్టు సమర్థంగా సాధిస్తోందని పేర్కొన్నారు. సముద్ర రంగంలో కార్బన్ ఉద్గారాలను తగ్గించే దిశగా భారత ప్రభుత్వం చేపట్టిన గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహానికి పోర్టు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ, పోర్టులో గ్రీన్ ఎనర్జీ, సస్టెయినబుల్ ట్రాన్స్‌పోర్టు మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఇది కీలకమైన ముందడుగని పేర్కొన్నారు.

వాల్తేరు డివిజన్ పిఆర్‌ఒగా జయరాం



బిర్లంగి జయరాం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో చీఫ్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న బిర్లంగి జయరామ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా ప్రమోషన్ పొందారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ నందిగాం సింహానందకుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జయరాంకు సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.



పోర్టు చైర్మన్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చెప్పారు. మత్స్యకార సంఘాల నాయకులతో కలిసి మంగళవారం విశాఖపట్నం పోర్టు చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఫిషింగ్ హార్బర్లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను పోర్టు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిల్లో ప్రధానంగా కోవిడ్ టైంలో మత్స్యకారులు పోర్టుకు పన్నులను చెల్లించలేదని, ఆ బకాయిలు రద్దు చేయాలని కోరారు. పడవలను వార్ఫ్‌పై ఉంచేందుకు అవసరమైన క్రేన్లను పోర్టు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి పోర్టు చైర్మన్ హామీ ఇచ్చారు. ఎస్ఎల్ కాలువ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కూడా కోరారు. కార్యక్రమంలో ఎపి మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్ అసోసియేషన్, డాల్ఫిన్ అసోసియేషన్ ప్రతినిధులు, కూటమి నేతలు, ఫిషింగ్ హార్బర్ పెద్దలు అప్పారావు, లక్ష్మణరావు, జివిఎంసి డిఇ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.